క్లుప్తంగా

ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన ట్రైనీ కలెక్టర్



హుస్నాబాద్: హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారిగా ఫైజాన్ అహ్మద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఆర్డీఓగా పని చేసిన జయచంద్రారెడ్డి మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా నల్గొండ జిల్లాకు బదిలీ అయ్యారు. అనంతరం కొన్ని రోజులు సిద్దిపేట ఆర్డీఓ అనంతరెడ్డి ఇన్‌చార్జ్ బాధ్యలు చేపట్టారు. ప్రస్తుతం ట్రైనీ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆర్డీఓగా పూర్తి స్థాయి బాధ్యతలు స్వీకరించారు.

అందరి సహకారంతో ఆలయ నిర్మాణం



పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ వనిత

దుబ్బాక: పట్టణంలో కొలువైన పోచమ్మ తల్లి ఆలయాన్ని అందరి సహకారంతో పునఃనిర్మాణం చేసుకుందామని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. గురువారం పోచమ్మ తల్లి ఆలయం పునఃనిర్మాణ పనులను ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి, ఆలయ బాధ్యులు వడ్లకొండ శ్రీధర్, పులిగారి ఎల్లం, చింత చంద్రమౌళి, చింత నాగేందర్, ఎల్లారెడ్డి, పద్మారెడ్డి, తదితరులున్నారు.

సకాలంలో కూలి చెల్లించాలి



నిర్మల్‌నగర్‌లో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, పని ప్రదేశంలో కనీస వసుతులు కల్పించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి కోరారు. గురువారం ఎంపీడీఓ శ్రీనివాస్‌వర్మకు వినతి పత్రం అందించారు. నిర్మల్‌నగర్ గ్రామంలో ఉపాధి పనులను సందర్శించి, మాట్లాడారు. గతేడాది నుంచి ఎంఎంఎస్ యాప్ విధానంతో కూలీలకు కనీస సదుపాయాలు కరువు అయ్యాయని ఆరోపించారు. వెంటనే కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ప్రీస్కూల్‌పై అవగాహన



మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని గంగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ప్రీస్కూల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ శారద మాట్లాడుతూ విద్యార్థులకు అంగన్‌వాడీ కేంద్రంలో నేర్పిస్తున్న ప్రీస్కూల్ బోధనతో మానసిక, శారీరక, అభివృద్ధికి తోడ్పడుతుందని తల్లిదండ్రులకు వివరించారు. పిల్లలకు ప్రతీ రోజు పౌష్టికాహారం అందించాలని, అంగన్‌వాడీ కేంద్రం నుంచే ప్రాథమిక విద్యకు సంసిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. పిల్లల ప్రగతి, సృజనాత్మకత, ఆట, పాటలు ద్వారా విద్యా బోధన అందుతుందన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

హుస్నాబాద్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1988–89 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అంతా ఒక చోట కలిసి పాత జ్ఞాపకాలను నేమరువేసుకొని ఆప్యాయంగా పలుకరించుకున్నారు. చదువు నేర్పిన పాఠశాలకు విరాళం సేకరించి అందించాలని నిర్ణయించుకున్నారు.

మే 1 నుంచి ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం

గజ్వేల్: గజ్వేల్ ఫుట్ క్లబ్ ఆధ్వర్యంలో మే 1 నుంచి 30వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ క్లబ్ ప్రధాన కార్యదర్శి గణేష్ తెలిపారు. మినీ స్టేడియంలో శిక్షణ ఉంటుందని, 9502194194, 9246939707, 81213 92441, 91218 37573, 9908789877 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కల్యాణానికి సర్వం సిద్ధం

- నేటి నుంచి పెద్దమ్మ పెద్దిరాజుల ఉత్సవాలు
- 3 రోజుల పాటు నిర్వహణ



దుబ్బాక పెద్దమ్మ తల్లి ఆలయం

దుబ్బాక: కోరిన కోర్కెలు తీర్చే మహిమగల తల్లిగా దుబ్బాక పెద్దమ్మ ఆలయం ప్రసిద్ధి చెందింది. పట్టణంలోని లచ్చపేట రోడ్డులో ఈ ఆలయం ఉంది. 2021లో అన్ని హంగులతో పునః నిర్మించి, మాధవానంద సరస్వతి స్వామి చేతుల మీదుగా ప్రారంభించారు. శుక్రవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానుండగా, ముదిరాజ్ కులస్తులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం గ్రామ దేవతలకు కొబ్బరి కాయలు కొట్టి ఉత్సవాలను ప్రారంభించారు. శుక్రవారం గ్రామ దేవతలకు, పోచమ్మ తల్లికి బోనాల ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి పుట్ట బంగారం తెచ్చే కార్యక్రమాలు ఉంటాయని ఆలయ బాధ్యులు పేర్కొన్నారు. శనివారం పెద్దమ్మ తల్లికి సదర్ బోనాలు, శోభాయాత్ర ఉంటుందన్నారు. ఆదివారం ఉదయం 11.05 నిమిషాలకు పెద్దమ్మ తల్లి పెద్దిరాజుల కల్యాణం, ఒడిబియ్యం, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పెద్దమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా ఆర్థిక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరుకానుండడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆలయాన్ని సర్వంగా సుందరంగా తీర్చిదిద్దాం. భక్తులకు అసౌకార్యులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.
– మాడబోయిన రాజు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



అక్కన్నపేట: పంతుల్ తండాలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ మంగ

హుస్నాబాద్‌రూరల్: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. గురువారం పోతారం(ఎస్), వంగరామయ్యపల్లిలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ రజని, సర్పంచ్‌లు సాయిలు, విజయలక్ష్మీ, సుశీల, ఎంపీడీఓ కుమారస్వామి, ఏపీఎం శ్రీనివాస్, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

నంగునూరు(సిద్దిపేట): అక్కేనపల్లి, గట్లమల్యాల, కొండంరాజ్‌పల్లి, ఘణపూర్, ఖాత, నంగునూరు, సిద్దన్నపేట, బద్దిపడగ, దర్గపల్లి, జేపీతండా, పాలమాకుల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య గురువారం ప్రారంభించారు. జెడ్పీటీసీ ఉమ, మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, సోమిరెడ్డి, వైస్ ఎంపీపీ రేణుక, రమేశ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుండారంలో ఏర్పాటు చేసి వరి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం బెజ్జంకి ఎంపీపీ లింగాల నిర్మల ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య, ఏపీఎం నర్సయ్య, సర్పంచ్ లావణ్య, ఉపసర్పంచ్ రాము, డైరెక్టర్ భీమయ్య, కత్తి అంజయ్య, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని పంతుల్‌తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జెడ్పీటీసీ భూక్య మంగ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్య అశ్వినిహేము, సింగిల్ విండో డైరెక్టర్ రామచంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సాంబరాజు పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరు, మర్మాముల, ధర్మారం, సలాఖపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను వైస్‌ఎంపీపీ మల్లిపెద్ది సుమలత, నాగ్గిళ్ల తిరుపతిరెడ్డి ప్రారంభించారు. వారితో వైస్ చైర్మన్ ఇర్రిరాజిరెడ్డి, మండల సర్పంచ్‌లు ఫోరం అధ్యక్షుడు వంగ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఊట్ల రవీందర్‌రెడ్డి, స్రవంతి, సుదర్శన్, పీఏసీఎస్ డైరెక్టర్లు, ఉపసర్పంచ్‌లు కుమారస్వామి, శ్రీధర్, పీఏసీఎస్ సీఈఓ శ్రీధర్ పాల్గొన్నారు.

సీపీఆర్ పై అవగాహన పెంచుకోవాలి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

హుస్నాబాద్‌రూరల్: ఉద్యోగులు సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సౌమ్య అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగులకు గుండె సంబంధ వ్యాధులపై అవగాహన కల్పించారు. గుండె పోటు వస్తే సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చునో వివరించారు. వైద్య సిబ్బంది సహకారంతో గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఆమె తెలిఆపరు. కార్యక్రమంలో ఎంపీపీ మానస, ఎంపీడీఓ కుమారస్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి



పనులను పరిశీలిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ రాజిరెడ్డి

హుస్నాబాద్‌రూరల్: మన ఊరు మనబడి కింద చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయాలని జెడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి అన్నారు. మండలంలోని పోతారం (ఎస్) ప్రభుత్వ పాఠశాలలో పనులను గురువారం ఎంపీపీ మానసతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆర్ అండ్ బీ ఏఈ మజీద్‌తో మాట్లాడి పనుల పురోగతి, ఎంబీ రికార్డుపై తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పనులకు సంబంధించిన బిల్లులను ఇప్పించాలని కాంట్రాక్టర్ యాదగిరి కోరగా, విషయాన్ని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బిల్లులు మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయనతో ఎంపీడీఓ కుమారస్వామి, మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజిని, సర్పంచ్ బత్తిని సాయిలు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబురాలు



తొగుటలో మాట్లాడుతున్న రాంరెడ్డి

తొగుట(దుబ్బాక): సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి అన్నారు. పార్టీ ఏర్పడి 22ఏళ్లు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంలో గురువారం సంబరాలు నిర్వహించారు. రాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ గోవర్దన్‌రెడ్డి, ఎఎంసీ చైర్మన్ కొమురయ్య, రైతుబంధు మండల అధ్యక్షుడు కనకయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదగిరి, ఎఎంసీ మాజీ అధ్యక్షుడు కనకయ్య, ఎఎంసీ, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం జగదేవ్‌పూర్ మండలం తిగుల్‌లో రైతుబంధు మండల కో ఆర్డినేటర్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేసి, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ భవనానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఐలయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, ఉప సర్పంచ్ ఐలయ్య, నాయకులు మధుచారి, వెంకట్‌గౌడ్, దయానంద్‌రెడ్డి, ఆంజనేయులు, ఎల్లారెడ్డి, అశోక్, నర్సింహ్మారెడ్డి, ఈశ్వర్, రాములు, కరుణకర్‌రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కూలర్ల బహూకరణ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి సిద్దిపేటకు చెందిన మాంగళ్య క్లాత్ స్టోర్ యాజమాన్యం రెండు కూలర్లను బహూకరించారు. వేసవిలో భక్తుల సౌకర్యార్థం ఉపయోగించాలని గురువారం ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఏఈవో శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' పేదలకు వరం

చిన్నకోడూరు(సిద్దిపేట): కంటి వెలుగు కార్యక్రమం పేదలకు వరమని పీఏసీఎస్ చైర్మన్‌లు ములకల కనక రాజు, సదానందం గౌడ్ అన్నారు. గురువారం రామంచలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి, అద్దాలు, శస్త్ర చికిత్సలు చేస్తారని, గ్రామస్తులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోషి, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ సోమిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, శ్రీకాంత్, రామచంద్రం పాల్గొన్నారు.

పరిహారం అందేలా చూస్తాం

ఎంపీపీ ర్యాగల్ల సుగుణ



మాత్‌పల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న ఎంపీపీ సుగుణ తదితరులు

కొండపాక(గజ్వేల్): వడగండ్లతో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తామని ఎంపీపీ ర్యాగల్ల సుగుణ, ఎస్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ తెలిపారు. మండల వ్యవసాయాధికారి ప్రియదర్శినితో కలిసి కుకునూరుపల్లి మండలం మాత్‌పల్లి, కొండపాక మండలం మర్పడ్గ, అంకిరెడ్డిపల్లి గ్రామాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా దెబ్బతిన్న పంటను పరిశీలించి, వివరాలు నమోదు చేసుకోవాలని ఏఓకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బచ్చలి మహిపాల్, ఏమల్ల రజిత, బడేకోలు లావణ్య, ఎంపీటీసీ పత్తి ఆంజనేయులు, ఏఈఓలు విష్ణు, రమ్య, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ దుర్గయ్య, ఆత్మ కమిటీ డైరెక్టరు పాల శంకర్, నాయకులు కోల రవీందర్, పుల్లూరి యాదగిరి, బొంతల శ్రీనివాస్‌రెడ్డి, కోరె చరణ్, కరుణాకర్, బడేకోలు నర్సింలు, కిష్టారెడ్డి, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగేలా చూడాలి

జేఏసీ చైర్మన్ పరమేశ్వర్



నిరసన అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): వడగండ్ల వానకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు నష్టపరిహారం చెల్లించాలని జేఏసీ చైర్మన్ రామగళ్ళ పరమేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంగడి బజార్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జేఏసీ, అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఆరిఫాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జేఏసీ, అఖిలపక్ష నాయకులు ఆగంరెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, అశోక్, నర్సింగరావు, కళావతి, లింగం, బీరయ్య, సత్యనారాయణ, యాదయ్య, చిరంజీవులు, భూమయ్య, ఎక్బాల్, లాల్, రాజిరెడ్డి, రంజిత్‌రెడ్డి, నర్సిరెడ్డి, సుదర్శన్, శోభ, విజయ, అరుణ్, మల్లేశం, శ్రీకాంత్, రవి, చక్రపాణి, శంకరయ్య, నరేష్, నర్సింహులు, శ్రీశైలం, నాగమ్మ, అంజయ్య, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రైతు గోసను రాజకీయం చేయడం సరికాదు

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్ రావు

దుబ్బాక: అకాల వర్షంతో నష్టపోయిన రైతుల పరామర్శకు వచ్చిన మంత్రి హరీశ్‌రావు రైతుల గోసను రాజకీయం చేశారని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు ఆరోపించారు. గురువారం దౌల్తాబాద్ మండలం ఇందూప్రియల్‌లో శాలీవాహన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ, కుర్మ సంఘం భవన నిర్మాణానికి బోరు వేయించారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు రూ.30వేల సాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాలకు 16 గ్రామాల్లో రైతులు పంటలు నష్టపోయారని, నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు. వరంగల్, ఖమ్మం, మహబూబ్‌బాద్ జిల్లాలో వర్షాలకు పాడైన పంటలను పరిశీలించి రూ.10 వేలు ప్రకటించిన సీఎం కేసీఆర్ జీఓ విడుదల చేశారనని గుర్తు చేశారు. ఆ జీఓలో కేంద్రం ఎన్‌డీఆర్ఎఫ్ నిధుల కింద రూ.3వేల కోట్లను విడుదల చేసిందని స్పష్టంగా ఉందన్నారు. ఆర్థిక శాఖ మంత్రి కేవలం దుబ్బాకే మంత్రి అన్నట్లు ప్రవర్తించడం సరికాదన్నారు. నా గెలుపును జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకుల శాపనార్థలే మాకు ఆశీర్వచనాలని, ప్రజలే మమ్మల్ని మళ్లీ గెలిపించుకుంటారని అన్నారు.

తహసీల్దార్లకు వినతి

కోహెడ(హుస్నాబాద్)/హుస్నాబాద్/సిద్దిపేటరూరల్/గజ్వేల్: అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, మామిడి పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బీజేపీ మండలాధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. హుస్నాబాద్ తహసీల్దార్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. సిద్దిపేట రూరల్ మండలంతహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి వినతిపత్రం అందించారు. గజ్వేల్‌లో ఐఓసీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు.

రాయితీని సద్వినియోగం చేసుకోండి

మున్సిపల్ కమిషనర్ సంపత్



పన్ను వసూలును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సంపత్

సిద్దిపేటజోన్: ప్రభుత్వం అందిస్తున్న రాయితీని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సంపత్ అన్నారు. గురువారం పట్టణంలో ఆస్తి పన్ను వసూలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బిల్ కలెక్టర్లు, రెవెన్యూ సిబ్బందితో కలిసి రాయితీపై ప్రజలకు వివరించారు. ఏప్రిల్ 30లోగా ఆస్తి పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. అంతకుముందు ఇరుకోడ్ శివారులో జరుగుతున్న స్లాటర్ హౌస్ నిర్మాణ పనులను, హౌసింగ్ బోర్డ్ శివారులో మిడిల్ స్టేషన్ సందర్శించి చెత్త రీసైక్లింగ్ పనులను పరిశీలించారు. ఆయనతో మున్సిపల్ అధికారులు రంజిత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నష్టపరిహారం అందజేత

సిద్దిపేటరూరల్: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్‌గౌడ్ రూ.10 వేల సాయం అందించారు. సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలం పలు గ్రామాల్లో గురువారం బాధితులకు సాయం అందజేశారు. రైతులకు చేయూత అందించేందుకు ఫౌండేషన్ తరపున సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

వర్గల్(గజ్వేల్): మండలంలోని అవుసులోనిపల్లికి చెందిన గుర్రాల పద్మకు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.30,000 మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కును గురువారం సర్పంచ్ కరుణాకర్ బాధితురాలికి అందజేశారు.

◆ 41సార్లు రక్తదానం

కోహెడరూరల్(హుస్నాబాద్): ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలిస్తున్నాడు మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన జేరిపోతుల శ్రవణ్. అదే గ్రామానికి చెందిన తుంగ బాలవ్వ అనారోగ్యంతో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరగా, గురువారం ఆమెకు రక్తదానం చేశాడు. ప్రతీ ఐదు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తున్నట్లు శ్రవణ్ తెలిపాడు.

◆ రైతులను ఆదుకోవాలి

మిరుదొడ్డి(దుబ్బాక)/జగదేవ్‌పూర్(గజ్వేల్): వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీసీసీ (కేరింగ్ సిటిజెన్ కలెక్టివ్) జిల్లా కో ఆర్డినేటర్ సూకూరి ప్రవీణ్, తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులిరాజు అన్నారు. గురువారం ఆయా గ్రామాల్లో పంటలను పరిశీలించారు. రైతులకు ఎకరానికి రూ.30వేల సాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

◆ కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దూలం శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండలంలోని వింజపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. కొనుగోళ్లు ఆలస్యం కావడంతో వర్షానికి ధాన్యం తడిసి పోయిందని అన్నారు.

◆ పరిహారం చెల్లించాలి

దుబ్బాకరూరల్: వర్షంతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని ఎనగుర్తి గ్రామంలో వరి పంటలను పరిశీలించారు. రైతు రుణాలను మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆయనతో వెంకటస్వామిగౌడ్, యాదగిరి, సాగర్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ పంటల పరిశీలన

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాల మండలం అర్జున్ పట్ల, కమలాయపల్లి గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న పంటలను జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి పరిశీలించారు. ఆయనతో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్‌యాదవ్ ఉన్నారు.

మిరుదొడ్డి (దుబ్బాక): అకాల వర్షంతో నష్టపోయిన పంటలను గురువారం వైస్ ఎంపీపీ పోలీస్ రాజు, తహసీల్దార్ ఉదయశ్రీ, ఏఓ మల్లేశం పరిశీలించారు. వివరాలు నమోదు చేసి ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

◆ కాంగ్రెస్‌కు రాజీనామా

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని పెరుకబండకు చెందిన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వడ్లూరి పర్శరాములు గురువారం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణలకు రాజీనామా లేఖలను పంపించినట్లు తెలిపారు.

◆ ఘనంగా పోచమ్మ బోనాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని పెద్దమ్మ ఆలయ రెండో వార్షికోత్సవంలో భాగంగా గురువారం పోచమ్మకు భక్తులు బోనాలు సమర్పించారు. పట్టణంలోని ముదిరాజ్‌లు బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. శుక్రవారం పెద్దమ్మ బోనాలు, శనివారం పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

◆ ప్రభుత్వం అండ

మిరుదొడ్డి (దుబ్బాక): పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీపీ గజ్జెల సాయిలు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు తుమ్మల బాలరాజ్ అన్నారు. గురువారం మిరుదొడ్డి మండలంలో విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు పరిహారం చెల్లిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోలీసు రాజు, మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లాల సత్యనారయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి ఉన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ పేదలకు అండ

దుబ్బాక: మున్సిపల్ పరిధిలోని చెల్లా పూర్‌కు చెందిన కాముని శ్రీకర్‌కు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం కౌన్సిలర్ గోనేపల్లి దేవలక్ష్మీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రవి, కిషన్, నర్సింలు, రాజయ్య ఉన్నారు.

◆ కేశవాపూర్‌లో నేత్ర శిబిరం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కేశవాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం జెడ్పీటీసీ భూక్య మంగ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మగాని రాజేశం పాల్గొన్నారు.

◆ అసత్య ప్రచారాలు నమ్మొద్దు

సిద్దిపేటకమాన్: తమ హోటల్‌పై వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దని సోని హోటల్ యజమాని అక్బర్ తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకర్లతో మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం రెస్టారెంట్ బాత్‌రూంలో బియ్యం కడుగుతున్నారంటూ వచ్చిన వీడియోల్లో వాస్తవం లేదన్నారు.

◆ స్నేహితుల ఆపన్న హస్తం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన నాంపెల్లి పద్మ చికిత్స నిమిత్తం మిత్రులు ఆర్థిక సాయం అందించారు. 1999–20 బ్యాచ్ పదో తరగతి స్నేహితులు గురువారం పద్మను పరామర్శించి రూ.21వేలు సాయం అందించారు. పర్ష సంతోష్, బొల్లి నాగరాజు, కాపర్తి మహేష్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

◆ పీఎంశ్రీ పథకానికి ఎంపిక

జగదేవ్‌పూర్(గజ్వేల్): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎం శ్రీ పథకానికి జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ పథకం ద్వారా పాఠశాలలో సోలార్ ప్యానళ్లు, ఎల్ఈడీ లైట్లు, ప్లాస్టిక్ రహిత, వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ, పోషకాహార తోటల పెంపకం, పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపడుతారని తెలిపారు. ఈ సదుపాయాల కోసం ఏటా పాఠశాలకు గ్రాంటు నిధులు మంజూరు చేస్తారని పేర్కొన్నారు. పాఠశాల ఎంపికపై సర్పంచ్ చంద్రశేఖర్ గుప్తా హర్షం వ్యక్తం చేశారు.

◆ మంత్రి రాలేదని రైతుల నిరసన

దుబ్బాకరూరల్: మండలంలో వడగండ్లతో నష్టపోయిన పంటల పరిశీలనకు వచ్చిన మంత్రి హరీశ్ రావు తమ గ్రామంలో పర్యటించలేదని హబ్సిపూర్ గ్రామస్తులు ఆరోపించారు. గురువారం హబ్సిపూర్ ఎక్స్ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. వానకు గ్రామంలోని వరి పంటలు, మామిడి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కొన్ని గ్రామాల్లోనే పర్యటించి వెళ్లారని, మాగ్రామానికి ఎందుకు రాలేదంటూ ప్రశ్నించారు. రోడ్డుపై అరగంటకు పైగా బైఠాయించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సీఐ కృష్ణ, వ్యవసాయాధికారులు చేరుకుని నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

◆ పర్యటనలతో విద్యార్థులకు మేలు

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల వృక్ష, జీవసాంకేతిక శాస్త్ర విద్యార్థులు గురువారం హైదరాబాద్‌లోని పలు పరిశోధనా కేంద్రాలను సందర్శించారు. క్షేత్రస్థాయి పర్యటనలతో విద్యార్థులలో పరిశోధనపై ఆసక్తి పెంపొందుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మదన్‌మోహన్, డాక్టర్ శైలజ, డాక్టర్ రాణి, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ధర లేక.. అమ్మలేక



జగదేవ్‌పూర్(గజ్వేల్): వడగండ్ల వానలు.. ఆపై మార్కెట్‌లో ధరలు టమాటా రైతులను నిలువునా నష్టాలపాలు చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వడగండ్ల వానకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మరోవైపు ఉన్న పంటను మార్కెట్‌కు తరలిస్తే ధర లేదని ఆవేదన చెందిన ఓ రైతు మండలంలోని తిమ్మాపూర్‌లో పెద్దమ్మ ఆలయం ప్రక్కన సుమారు రెండు క్వింటాళ్లకు పైగా టమాటాను పారబోశాడు. ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది.

సమ్మెకు మద్దతు తెలపాలి

తొగుట(దుబ్బాక): సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మెకు మద్దతు ఇవ్వాలని ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కోరారు. గురువారం ఆయనకు వినతి పత్రం అందజేశారు. సమస్యలను మంత్రి హరీశ్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఆయన వారికి తెలిపారు.

చేర్యాల(సిద్దిపేట): ఈ నెల 28వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నట్లు మండలంలోని ఆయా గ్రామాల్లో పని చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. గురువారం సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెడతల ఎల్లారెడ్డికి సమ్మె నోటీస్ అందజేశారు.